


నాడు నేడు పనుల్లో నాణ్యత పాటించాలి

జెడ్‌పిటిసి సభ్యులు మత్స్యలింగ

ప్రజాశక్తి-హుకుంపేట:నాడు నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జెడ్పిటిసి రేగం మత్స్యలింగ కోరారు. మండలంలోని పాతకోట పంచాయతీ మర్రిపాలెం, పనసపపుట్టు, పాలెం, తదితర గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు ఈ సందర్భంగా జెడ్పిటిసి మాట్లాడుతూ నాడు నేడు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పాతకోట సచివాలయం సందర్శించి ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి ఆయన స్వయంగా తెలుసుకున్నారు. గ్రామ వాలంటీర్లతో మాట్లాడి ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పని చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చూడాలని ఆయని సూచించారు. పాలెం పాఠశాలలో నాడు నేడు పనులు పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని స్థానిక సర్పంచ్ చిన్నయ్యని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, వైఎస్సార్సిపి నాయకులు చిన్నయ్య, రాంబాబు, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు సెయింట్ ఆన్స్ పాఠశాలలో స్పోర్ట్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన మార్చ్ ఫాస్ట్, విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జడ్‌పి ఛైర్మన్ సుభద్ర, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, ఎఎస్‌పి అతుల్ సిన్హా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక వ్యాయామం కూడా లభిస్తుందన్నారు. చదువులో రాణించడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఉద్యోగ అవకాశాల్లో క్రీడలకు ప్రాముఖ్యం ఉంటుందన్నారు. గిరిజన ప్రాంతంలో ఇటువంటి విద్యాసంస్థ ఉండడం సంతోషమని తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. గత సంవత్సరం 10వ తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానించారు. అంతకుముందు సబ్ కలెక్టర్ వి.అభిషేక్, ఎఎస్‌పి అతుల్ సిన్హా పాఠశాల జెండా ఆవిష్కరణ చేసి విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ రమేష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

హెల్త్‌అసిస్టెంట్‌లను రిలీవ్ చేయండి

డిఎం అండ్ హెచ్‌ఓకు గిరిజన ప్రాంత వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం నేతల వినతి

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లాలో బదిలీ అయిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను రిలీవ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని గిరిజన ప్రాంత వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం పాడేరులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు శెట్టి నాగరాజు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లను డిప్లయ్మెంట్ చేసి ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా చూడాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, దీని ప్రకారంగా ఉమ్మడి జిల్లా విశాఖ పట్నం ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్‌లను మూడు దఫాలుగా కౌన్సిలింగ్ అయిన పిమ్మట ఆర్డర్స్ జారీ చేశారని, నేటికీ 20 రోజులు గడుస్తున్నా అల్లూరి సీతారామరాజు జిల్లాలో హెల్త్ అసిస్టెంట్లకు రిలీవింగ్ ఆర్డర్స్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కొక్క హెల్త్ అసిస్టెంట్ రెండు నుంచి ఆరు వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లో విధులను నిర్వహించే విధంగా మ్యాపింగ్ చేయగా, గిరిజన ప్రాంతం ప్రత్యేకతల దృష్ట్యా ఒక్కో హెల్త్ అసిస్టెంట్‌కి ఒక్క వైయస్సార్ హెల్త్‌క్లినిక్ మాత్రమే ఇచ్చారన్నారు. హెల్త్ అసిస్టెంట్లు కౌన్సిలింగ్ ద్వారా బదిలీ అయినచోట విధులు నిర్వహించాలో లేక గతంలో పని చేసిన చోట చేయాలో ఇప్పటికీ అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వక పోవడంతో గందరగోళ పరిస్థితిని ఎదుర్కొం టున్నారని చెప్పారు. కౌన్సిలింగ్ ప్రకారంగా హెల్త్ అసిస్టెంట్లకు బదిలీ అయిన చోట ఆర్డర్స్ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ కాన్సెప్ట్‌లో విధి నిర్వహణ చేసుకునేలాగా అవకాశం కల్పించవలసిందిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కోరారు. సోమవారం నాటికి ఈ సమస్యకు పరిష్కారం చూపించకపోతే గిరిజన ప్రాంతంలో పని చేస్తున్న కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. హెల్త్ అసిస్టెంట్ల రిలీవ్ ఉత్తర్వుల జారీపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి జమాల్ బాషా హామి ఇచ్చారని మెడికల్ ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు.



నినాదాలు చేస్తున్న జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు

భవనాలు పూర్తిగా నిర్మించాలి

జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని ఎగువశోభ పంచాయతీ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలు పూర్తి చేయాలని జెడ్పిటిసి దిసరి. గంగరాజు ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గంగరాజు మాట్లాడుతూ, ఎగువశోభ పంచాయతీలో భవనాలు ఎందుకు పూర్తి కాకుండా పునాది దశలోనే నిలిపివేశారని ప్రశ్నించారు. స్థానిక అధికారులు, కాంట్రాక్టర్లు పనులు నిలిపివేసి ప్రజాభివృద్ధికి సహరించకుండా నిర్లక్ష్యం వహించడం సరి కాదని ఆయన మండిపడ్డారు. దీనిపై జిల్లా పరిషత్, ఐటీడిఎ పాలకవర్గం, జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

సుత్తిగూడలో 'బాదుడే బాదుడు'

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో అతి మారుమూల పంచాయతీ సుత్తిగూడ గ్రామంలో టిడిపి అరకు పార్లమెంట్ సెక్రెటరీ శాస్త్రిబాబు ఆధ్వర్యాన బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రిబాబు మాట్లాడుతూ, సుత్తిగూడ గ్రామంలో సీసీ రోడ్లు, మంచినీరు సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టాలు, రైతు భరోసా, ప్రభుత్వ పథకాలు కల్పించాలని తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో సంక్షేమ పథకాలు అందరికీ అమలు అయ్యాయని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. గిరిజన రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడిపి సీనియర్ నాయకులు నీలకంఠం పాత్రో, రామదాసు, భగత్‌రామ్, రఘుపతి పడాల్, సుబ్రహ్మాణ్యం, గురుమూర్తి, కిల్లో రొబ్బి, దశరధి, రామకృష్ణ, గురుమూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పక్కాగా పారిశుధ్య నిర్వహణ

కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి -రంపచోడవరం

అన్ని గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు పక్కగా నిర్వహించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌తో కలిసి ఐటిడిఎ పిఒలు, సబ్ కలెక్టర్లు, ఎంపీడీవోలు, నిర్మాణ, విద్యాశాఖ, సర్వే అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడబడితే అక్కడ చెత్త చెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలో ప్రతిరోజు పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. వై.రామవరం, కొయ్యూరు మండలం మధ్యలోని పాఠశాలలను ఎప్పటికప్పుడు ఎంపీడీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. బడి ఈడు పిల్లల గురించి సర్వే జరుగుతుందన్నారు. గృహాలు మంజూరైన లబ్ధిదారులందరికీ రిజిస్ట్రేషన్, జియో టాకింగ్ తప్పకుండా చేయాలన్నారు. జిల్లాలోని సెల్ ఫోన్ టవర్ల ఏర్పాటుపై ఆయన ఆరా తీశారు. ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములు ఏ విధంగా రీ సర్వే చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు సూరజ్ గనోరే, గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్లు శుభం బన్సల్, పర్మన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ ఆశితోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ బి.దయానిధి, జిల్లా సర్వే అధికారి మోహనరావు, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏపీవో సిహెచ్.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, ఎంపీడీవో ఎన్టీఆర్ కుమార్ బాబు, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

ప్రజాశక్తి-కూనవరం

జిసిసి డిపోల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని సర్పంచ్ వెంకమ్మ, మాజీ ఎంపీటీసీ మేకల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కూటూరు జిసిసి డిపోను బుధవారం వారు సందర్శించారు. స్టోర్ నుండి ప్రభుత్వం ఇచ్చే నిత్యావసర సరుకుల గురించి సేల్స్ మెన్‌ను అడిగి తెలుసుకున్నారు. పంచదార, పప్పు, నూనె ప్రభుత్వం నుండి రావటం లేదని సేల్స్‌మెన్ తెలిపారు. సర్పంచ్, మాజీ ఎంపీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు సబ్సిడీపై పప్పు, పంచదార, మంచినూనె అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శీలం వెంకమ్మ, సోడి నాగేశ్వరరావు, బొడ్డు కాంతమ్మ, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు



జిసిసి డిపోను పరిశీలిస్తున్న సర్పంచ్



శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:వనభసింగి గ్రామ పంచా యతీలో సిసి రోడ్డు పనులను జడ్పీ ఛైర్ పర్సన్ సుభద్ర, మండల ఎంపిపీ సీతమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి జడ్పీ ఛైర్పర్సన్ నిధులు గ్రామానికి కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలలో సమస్యలు ఉన్నాయని, వాటన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. సీసీ రోడ్ల నిధుల మంజూరుకు జెడ్పి ఛైర్ పర్సన్ సుభద్రకు విన్నవించుకోవడంతో నాలుగు లక్షలు మంజూరు చేశారని తెలిపారు. గ్రామాలలో తాగునీరు, డ్రైనేజీ, తదితర సమస్యలను పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు మల్లికార్జున, వార్డు మెంబరు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న దొన్నుదొర

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు దొన్నుదొర

ప్రజాశక్తి-హుకుంపేట:వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం అని, మారుమూల గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర అన్నారు. మండలంలోని మెరకచింత పంచాయతి కరకపుట్టు, తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన్యంలో అభివృద్ధి శూన్యమని ఆయన అన్నారు. అభివృద్ధి పనులు చేయడం చేతకాక సంక్షేమ పథకాల కోసం మాట్లాడటం సరికాదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని పేదోడి సొంతింటి కల గృహ నిర్మాణాలు, తారు రోడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించక పోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో టిడిపి హాయాంలోనే అభివృద్ధి జరిగిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం వైసిపి హయాంలో అభివృద్ధి అన్న మాట ఎక్కడా కానరాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

రామవరం పంచాయతీలో రీ సర్వే చేయాలి

రెండో రోజూ కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-చింతూరు

జిల్లాలోని విఆర్.పురం మండలం రామవరం పంచాయతీ రామవరంపాడు, రామవరం గ్రామాల్లో పోలవరం నిర్వాసితులకు సంబంధించి రీ సర్వే చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఈ గ్రామాలకు చెందిన పోలవరం నిర్వాసితులు చింతూరు ఐటిడిఎ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. బుధవారం నాటి దీక్షలకు గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పులి సంతోష్ కుమార్, విఆర్.పురం జెడ్‌పిటిసి రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి రామారావు, టిడిపి నాయకులు బురక కన్నారావు, బొర్రా నరేష్ కుమార్ ఆదివాసీ నాయకులు వెంకటరమణ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది నాలుగు సార్లు వచ్చిన వరదలకు రామవరంపాడు, రామవరం గ్రామాల్లో ఇళ్లు మొత్తం మునిగిపోయాయని తెలిపారు. బాధితుల గుర్తింపునకు చేసిన సర్వే అంతా తప్పులు తడకగా ఉందని తెలిపారు. ఇలాంటి తప్పుడు లెక్కలు చూపి నిర్వాసితులకు అన్యాయం చేస్తే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రహీం, ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి, శ్రీరామగిరి ఉపసర్పంచ్ దుర్గారావు, బీరాక సూర్య ప్రకాష్ రావు, బురక సారయ్య, పండ రత్తయ్య, కాక్రోచ్ రంగాచారి, బోధ బోయిన సురేష్, ముత్యాల పోస్ట్‌బాబు, పెట్టా వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న రామవరం పంచాయతీ ప్రజలు



స్వాధీనం చేసుకున్న మావోయిస్టు డంపు సామగ్రి ,చూపుతున్న పోలీసులు

మావోయిస్టు డంప్ స్వాధీనం

ప్రజాశక్తి- సీలేరు : ఏవోబీలోని మల్కన్‌గిరి జిల్లా కటాఫ్ ఏరియాలో జొడొంబో పోలీసుస్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో గాలింపు చేపడుతున్న పోలీస్ బలగాలకు డక్‌పొదర్ వద్ద మావోయిస్టు పార్టీ డంప్ లభ్యమైంది. ఈ డంప్‌లో భారీ ఎత్తున పేలుడు సామాగ్రి, ఆయుధాలు, మందుపాతరలు ఉన్నట్లు గుర్తించిన ఒడిశా పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న డంపును పరిశీలించగా మూడు తుపాకీలు, 18 మందుపాతరలు, గ్రానైట్స్, డిటోనేటర్స ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులు విధ్వంసం సృష్టించడానికి ఈ డంప్‌ను దాచిపెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎఒబి కటాఫ్ ఏరియాలో ఇంకా ఏమైనా డంపులు ఉన్నాయా? అన్న కోణంలో పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఇటీవల కాలంలో ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో సానుభూతిపరులను వందల సంఖ్యలో ఒడిశా పోలీసులు సరెండర్ చేసుకున్న సంగతి తెలిసిందే. ఏఓబి సరిహద్దులు మావోయిస్టులు కదిలినపై ఒడిశా పోలీసులు నిఘా పెట్టారు.

సత్యసాయి వాటర్ సప్లై కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాణిశ్రీ, వెంకట్

ప్రజాశక్తి మారేడుమిల్లి

మండలం సున్నంపాడు పంచాయతీ పరిధిలో సత్య సాయిబాబా డ్రింకింగ్ వాటర్ సప్లై కార్మికులకు 10 నెలల బకాయిలు జీతాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వాణిశ్రీ, పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. సత్యసాయి జయంతి సందర్భంగా బుధవారం పంపుహౌస్ వద్ద కార్మికుల ఆధ్వర్యాన సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వాణిశ్రీ, వెంకట్ మాట్లాడుతూ పది నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు పస్తులుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి రావలసిన అలవెన్స్‌లు కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం వట్టి మాటలతో కాలం గడుపుతుందని మండిపడ్డారు. ఈ జీతాల విషయమై పలుమార్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిని కలిసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మికి పలుమార్లు కార్మికులు వారి గోడువెలబుచ్చినా ఇసుమంత కనికరం లేకుండా ఉన్నారన్నారు. జీతాలు చెల్లించాలని ఈ నెల 24వ తేదీ నుండి విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. భారీ ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామన్నారు.



నిరసన తెలుపుతున్న సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కొయ్యూరు : సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రథమ మహాసభ డిసెంబర్ 20, 21 తేదీల్లో పాడేరులో జరుగుతుందని, ఈ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు వై.అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలం నడింపాలెం అంగన్వాడీ సెక్టార్ సమావేశం బుధవారం జరిగింది. ఇందులో పాల్గొన్న అప్పలనాయుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. అంగన్వాడీ వర్కర్ల పనిభారం పెరిగిందని, అనేక యాప్‌లతో తంబులు వేయాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ భద్రత కల్పించాలని అనేకసార్లు డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలను మార్పు చేశారని విమర్శించారు. ఉద్యోగులు, కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, స్కీమ్ వర్కర్ల సమస్యలు ఈ మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు వి.వెంకట లక్ష్మి, దేవుడమ్మ, నూకరత్నం, సత్యవతి, రాజేశ్వరి, దేవుడమ్మ, భారతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు అప్పలనాయుడు

ఐదుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి- అడ్డతీగల

మండలంలోని చిన్న మొనకనగడ్డ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడుతున్నారని అభియోగం మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అప్పలరాజు తెలిపారు. మల్లవరం మామిళ్ల గ్రామ శివారు ప్రాంతంలో గల తపస్సు కొండ రక్షిత అటవీ ప్రాంతాల్లో ఎవరైనా అక్రమగా రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడినా, ప్రోత్సహించిన కఠిన చర్యలు తీసుకుంటామని అడ్డతీగల ఎస్సై అప్పలరాజు హెచ్చరించారు. రంగురాళ్ల కోసం కొండల్లో తవ్వకాలు చేపడితే దానివల్ల ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందని. అందువల్ల తవ్వకాలకు పాల్పడిన లేదా ప్రోత్సహించిన కఠిన చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు.



చీరలు, సరుకులు పంపిణీ చేస్తున్న కృష్ణకుమారి, ధర్మ

చీరలు, సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలోని శాంతినగర్ గ్రామంలోని వితంతువులకు మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ మహిళ విభాగం అధ్యక్షురాలు కృష్ణకుమారి, అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ ఆధ్వర్యంలో బుధవారం వితంతువులకు చీరలతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మ మాట్లాడుతూ, నిరుపేద గిరిజనులకు ఎంతో కొంత సేవలందించాలనే ఉద్దేశంతో ఇటువంటి సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. సేవలందించడంతో ఎంతో ఆనందం కలుగుతుందని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మహేష్, సింహాచలం పాల్గొన్నారు.

సచివాలయాల్లో పూర్తి స్థాయి సేవలు

ప్రజాశక్తి-నక్కపల్లి:సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలని డివిఎల్‌డిఓ ఉదయశ్రీ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వాలంటీర్ల సర్వే, ఆధార్ సెంటర్‌లు, సచివాలయ ఉద్యోగుల పనితీరు, సచివాలయం సేవలు, హౌసింగ్ నిర్మాణాలు, ప్రభుత్వ భవనాలపై ఆరా తీశారు. ఎంపీడీవో సీతారామరాజు ఇందుకు సంబంధించిన వివరాలను ఆమెకు తెలియజేశారు. అనంతరం ఆమె దోసలపాడు, రేబాక సచివాలయాలను సందర్శించారు. వాలంటీర్ల సర్వే, ఆధార్ నమోదును పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, అప్పలరాజు, కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'జనసేనపై సిఎం వ్యాఖ్యలు సరికావు'

ప్రజాశక్తి - నర్సీపట్నం రూరల్:మత్స్యకార దినోత్సవ సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జనసేన పార్టీపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నర్సాపురం సభలో ముఖ్యమంత్రి తన ప్రసంగంలో జనసేన పార్టీని రౌడీ పార్టీగా అభివర్ణించడం సరికాదన్నారు. రౌడీలు, గుండాలు వైసిపిలోనే ఉన్నారని తెలిపారు. విశాఖలో చేస్తున్న దోపిడీలు తదితర విషయాలను బయట పెడుతున్నామన్నారు. ప్రజల పక్షాన నిలిచి ప్రజా సమస్యలపై పోరాడుతున్నామన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు గుర్తించి ప్రజాహిత పరిపాలన సాగించాలని హితవు పలికారు.

వికలాంగుల పింఛన్లపై సర్వే

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో వికలాంగుల పింఛన్లపై బుధవారం ఎంపీడీవో చంద్రశేఖర్ సర్వే నిర్వహించారు. ప్రధానంగా సదరం సర్టిఫికెట్ లేని వారిని తొలగిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అయితే అటువంటి వ్యక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో సదరం కేంద్రాన్ని ఏర్పాటు చేసి అర్హులందరికీ అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమ ంలో ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొత్తకోట: వికలాంగుల పింఛన్లపై జరుగుతున్న సమగ్ర పరిశీలనలో భాగంగా బుధవారం రావికమతం మండలం దొండపూడిలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఈవోఆర్‌డి సంజీవ రమణయ్య మాట్లాడుతూ, గ్రామంలో సుమారు 89 వికలాంగ పింఛన్ దారులు ఉండగా, 54 పింఛన్‌ల పరిశీలన చేశామని తెలిపారు. ఈ పరిశీలనలో సదరన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో ప్రస్తుతం పొందుతున్న పింఛన్ ఐడి, వ్యక్తి గత ఫోటో సేకరణ తదితర అంశాలను ప్రభుత్వం ఇచ్చిన యాప్ ద్వారా నమోదు చేస్తూన్నామని ఆయన వివరించారు. మండల వ్యాప్తంగా పింఛన్ పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జి.రాజారావు, సచివాలయ కార్యదర్శి దాలి నాయుడు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

జిఒ 3 పునరుద్ధరణకు వినతి

ప్రజాశక్తి-అరకులోయ:గిరిజనులకు ఉద్యోగ అవకాశాలలో 100 శాతం రిజర్వేషన్లు లభించే జీవో నెంబర్ 3ని వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ అరకులోయలో మంగళవారం సందర్శించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొరను ఆల్ ఇండియా షెడ్యూల్ ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవో 3 రద్దయిపోవడంతో అనేకమంది ఉద్యోగ అవకాశాలను యువత కోల్పోయారని పేర్కొన్నారు. ఆదివాసీల మన్య ప్రాంతంలో వైద్య సిబ్బందికి షెడ్యూల్ హోదా నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆ సంఘం ప్రతినిధులు విన్నవించారు. బోయ వాల్మీకులకు ఎస్టీ జాబితాలో చేర్చవద్దని విన్నవించారు.ప్రభుత్వం నియమించిన శామ్యూల్ కమిటీ, జీవో 52ను రద్దు చేయాలని వారు అభ్యర్థించారు.బోయ వాల్మీకులు అభివృద్ధి చెందిన వారని, జనాభాపరంగా 40 లక్షలు ఉన్న బోయ వాల్మీకులను బెంత, ఒరియాలను 15 లక్షల జనాభా ఉన్న ఆదివాసీల్లో కలపడం అశాస్త్రీయం అన్నారు. ఇది భవిష్యత్తులో రాజకీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పెను ప్రమాదం అని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. జీవో 52 రద్దు చేయలేని లేని పక్షంలో ఆదివాసి ప్రజా సంఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆల్ ఇండియా షెడ్యూల్ ట్రైబ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు నంద్, శేషాద్రి, సింహాచలం పేర్కొన్నారు.

పాఠశాలల భవనాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలో ధారెల గ్రామ పంచాయతీ రంగిలిసింగి, పెద్దపెట గ్రామాలకు రెండవ విడత నాడు నేడు నిధులతో భవన నిర్మాణాలకు సర్పంచ్ పాండు రంగ స్వామి, విద్యా కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాంగి పాండు రంగ స్వామి మాట్లాడుతూ, పంచాయతీలో పెద్దపేటకు రూ.34 లక్షలు, రంగిలిసింగిలో రూ.34 లక్షల చొప్పున రెండు గ్రామాల్లో పాఠశాలల నిర్మాణానికి రూ.68 లక్షల నిధులతో భవన నిర్మాణ పనులు చేపడతారని తెలిపారు.చీకుచింత గ్రామానికి రూ.36 లక్షలు మంజూరు అయ్యాయని, భవనాలను సకాలంలో చేయాలని కోరారు. గతంలో పాఠశాల భవనం లేక విద్యార్థులు విద్యాభ్యాసానికి అనేక ఇబ్బందులకు గురయ్యారని గుర్తు చేశారు. విద్యార్థులకు చదువు రావాలంటే పరిసరాలు బాగుండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అప్పలస్వామి, విద్యా కమిటి చైర్మన్ శంకర్, కామేష్, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, చైర్మన్

ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో పలు గ్రామాల్లో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ కోరారు. బుధవారం తహసీల్దార్ సుబ్రమణ్యం శాస్త్రికు భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు చేశారు. మండలంలోని చీడిక, చందనాడ, డిఎల్ పురంలో ఇనాం, ప్రభుత్వ భూములను కొంతమంది మధ్యవర్తులు అన్యాక్రాంతం చేస్తున్నట్లు ఆరోపించారు. సాగు భూములకు సంబంధించి నిజమైన లబ్ధిదారులను పక్కనపెట్టి, అనర్హుల పేరిట రికార్డును సృష్టించి భూములను కాజేయాలని చూస్తున్నారని అన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, వాస్తవ లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. చీడిక గ్రామంలో ఇనాం భూములకు సంబంధించి 30 ఎకరాల భూమికి 10 పది మంది పట్టాదారు పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, పూర్తిస్థాయిలో రికార్డులు అందుబాటులో లేనందున, ఉన్నత స్థాయి అధికారులకు నివేదించినట్లు తెలిపారని ఆయన అన్నారు.

అసైన్డ్ భూములు ఆక్రమిస్తే జైలుశిక్ష : ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: అసైన్డ్ భూములను ఆక్రమిస్తే ఆరు నెలల వరకు జైలుశిక్ష, 2 వేలు వరకు జరిమానామా తప్పదని ఆర్‌డిఒ జయరాం తెలిపారు. అసైన్డ్ భూములను లబ్ధిదారుల వారసులకు మాత్రమే అనుభవించే హక్కు కలదని అన్నారు. పీవోటీ చట్టం ప్రకారం - 1977 అసైన్డ్ భూములను ఎవరైనా ఆక్రమించినా, కొనుగోలు చేసినా ఆర్నెళ్ల జైలు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం సాగు చేసుకునేందుకు, లేదా ఇంటి నిర్మాణానికి ఇచ్చిన భూమిని అసైన్డ్ భూమిగా పేర్కొంటారని, ఈ భూమిని లబ్ధిదారు వారి వారసులు వారసత్వంగా అనుభవించడానికి మాత్రమే హక్కు ఉంటుందన్నారు. ఇతరుల పేర్ల మీదికి బదలాయించడం, అమ్మడం, దానం చేయడం, కౌలుకు ఇవ్వడం నిషేధమన్నారు. ఒకవేళ ఎవరైనా అసైన్డ్ భూములను కొన్నా ఈ చట్టం ప్రకారం వారికి ఎలాంటి హక్కులు దఖలు పడవని, ప్రభుత్వం ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవచ్చునన్నారు. అసైన్డ్ భూములను కొనుగోలు చేయడం చట్టప్రకారం నేరమని తెలిపారు. అసైన్డ్ భూమి అని కోర్టు తేల్చినా, ఆక్రమణలు కొనసాగిస్తే శిక్షార్హం అవుతుందని. కోర్టు గరిష్ఠంగా ఆరు నెలల వరకు జైలు శిక్ష లేదా రూ.2000 వరకు జరిమానా లేదా రెండు శిక్షలు కలిపి వేయవచ్చని తెలిపారు.

ఆర్‌డిఒకు అభినందనలు

నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి జయరామ్‌ను ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సమాచార హక్కు చట్టం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జీలానీ, మండల అధ్యక్షులు అన్వర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు.

పారదర్శకంగా సమగ్ర భూ సర్వే

నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి జయరాం

ప్రజాశక్తి-కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వేలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి జయరాం సూచించారు. బుధవారం ఆయన కోటవురట్ల తహసిల్దార్ కార్యాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన భూ సర్వే, జగనన్న కాలనీ తదితర వివరాలపై సంబంధిత అధికారుల నుండి ఆరా తీశారు. జగనన్న కాలనీ నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సిబ్బందితో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జానకమ్మ, ఎంపీడీవో చంద్ర శేఖరు, డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ అమలు చేయకుంటే చర్యలు

ప్రజాశక్తి -కొత్తకోట:అంగన్వాడీ కేంద్రాలలో మెనూ అమలు పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రావికమతం ఐసిడిఎస్ సిడిపివో ఉషారాణి అన్నారు. బుధవారం ఆమె కొత్తకోట సెక్టార్ పరిధి గాంధీ నగర్‌లో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీ పరిధిలో గర్భిణీ, బాలింత, కిషోర్ బాలికలు, చిన్నారులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. మెనూ అమలులో అశ్రద్ధ వహించినా, పిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న గుడ్లు, బాలామృతం, వైఎస్ఆర్ కిట్లు, తదితర సరుకులు పంపిణి పారదర్శకంగా ఉండాలన్నారు. ముఖ్యంగా సమయ పాలన ఉండాలన్నారు. సెలవు దినాల్లో మినహా కేంద్రాలను తెరవకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి నిల్వలను తనిఖీ చేశారు. ఆమె వెంట సెక్టార్ సూపర్ వైజర్ విజయ, అంగన్వాడీ కార్యకర్త జానికి ఉన్నారు.

సిబ్బంది కొరతపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-కోటవురట్ల:తహసిల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తహసిల్దారు జానకమ్మ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సమగ్ర భూ సర్వే, పెండింగ్ ఫైల్స్‌పై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదే విధంగా తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సహా 7 గ్రామాల గ్రామ రెవెన్యూ అధికారులు, 4సచివాలయ సర్వేయర్ల కొరతపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఘనంగా సత్య సాయిబాబా జయంతి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నర్సీపట్నంలో సత్య సాయి బాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామున నగర సంకీర్తనతో ప్రారంభించి కుంకుమ పూజలు, సత్యసాయి వ్రతాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని సత్య సాయి ప్రార్థనా మందిరంలో ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 7000 మందికి అన్నదానం చేశారు. వికలాంగులకు, యాచకులకు, కూలీలకు వస్త్రధానం చేశారు.

గొలుగొండ:ఏజెన్సీ లక్ష్మీపురం గ్రామంలో బుధవారం పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతి వేడుకలను స్థానిక సత్యసాయి భజన మండలి సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్థానిక షిరిడిసాయి ఆలయంలో సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు జరిపారు. వృద్ధులకు గ్రామీణ బ్యాంకు మేనేజర్ వై.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. అన్నసమారాధనకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు దక్షిణామూర్తి, కమిటీ సభ్యులు సత్యంబాబు, రామారావు, సత్యసాయి భజన మండలి కన్వీనర్ కన్వీనర్ దుల్లా శ్రీనివాసు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని నక్కపల్లి, వేంపాడు గ్రామాల్లో సత్యసాయి జయంతి వేడుకలను నిర్వహించారు .నక్కపల్లి లో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో కొత్త భగవాన్ ఇంటివద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు అన్న సమారాధన చేపట్టారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని రీషెడ్యూల్

ప్రజాశక్తి ఎంవిపి కాలనీ : భద్రక్ - కపిలాస్ రోడ్ సెక్షన్‌లోని కొరేయి స్టేషన్ సమీపంలో ఖాళీ గూడ్స్ రైలు పట్టాలు తప్పిన కారణంగా, పలు రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. మరికొన్నింటిని రీషెడ్యూల్ చేసింది.

22842 తాంబరం - సంత్రాగచ్చి అంత్యోదయ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 23న రద్దు చేశారు. 12864 ఎస్‌ఎంవి బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 10.35 గంటలకు బదులుగా 12.00 గంటలకు రీ షెడ్యూల్ చేసింది.

రాష్ట్రస్థాయి క్రీడలలో రమేష్ ప్రతిభ

ప్రజాశక్తి-చింతూరు



రమేష్‌ను అభినందిస్తున్న సబ్ కలెక్టర్, ఎటిడబ్ల్యుఒ

బిర్సా ముండా గిరిజన ఆత్మగౌరవ ఉత్సవాలలో భాగంగా విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయిలో క్రీడల్లో మండలం ఏడుగురాళ్లపల్లి పాఠశాలలో చదువుతున్న రవ్వ రమేష్ ప్రతిభ కనబర్చారు. రమేష్ హై జంప్‌లో మొదటి స్థానం, 4 ఇన్ టూ 100 మీటర్స్ రిలే పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా రమేష్‌ను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.రమణ, సీనియర్ ఉపాధ్యాయులు ఎ.రాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.ఇంద్రారెడ్డి, డిప్యూటీ వార్డెన్ కె.ముత్తయ్య, కె.భీమయ్య, టి.లక్ష్మయ్య, ఎస్ నాగేశ్వరరావు అభినందించారు. ఏటిడబ్ల్యూఓ కె.సుజాత ఆధ్వర్యాన చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కలిశారు.

అపారిశుధ్యం నిర్మూలనకు కృషి



అంగన్వాడీని పరిశీలిస్తున్న సర్పంచ్ రమణి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : పంచాయతీలో ఉన్న అన్ని గ్రామాలలో అపారిశుధ్యం నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామని రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి అన్నారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి ఎ మల్లేశ్వరావు ఆధ్వర్యంలో వాల్మీకి నగర్ సమీపంలోని అల్లి కాలువ వద్ద పారిశుధ్య నిర్వహణ చేపట్టారు. రవీంద్ర నగర్ జిపిఎస్ పాఠశాల, స్థానిక ఎంపీపీ పాఠశాలలో కొత్తగా ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని సర్పంచ్ రమణి పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి గుంటలు నీటి నిల్వలు ఉండకుండా ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆరుబయట మలమూత్ర విసర్జన చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మరిచర్ల లోవ కుమారి, దేవర దేవి, వజ్రపు సుగుణ, సచివాలయం సెక్రటరీ ప్రసాదు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాని, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఎం.రాంబాబు, జిపిఎస్ పాఠశాల హెచ్‌ఎం ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం మండలంలో కలెక్టర్ పర్యటన



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి :గంగవరం మండలంలోని పలు ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం పర్యటించారు. తొలిత పిడత మామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సిలో రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలో వసతులు, రోగులకు అందుతున్న వైద్యం గురించి ఆరా తీశారు. వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ వేముల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు, మెనూ ఏ విధంగా అమలు జరుగుతున్నది, తదితరు వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగవరం తాహశీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీడీవో శ్రీనివాసులు, వైద్యాధికారి సాయి రతన్, తదితరులు పాల్గొన్నారు.

25న రెవెన్యూ సమస్యలపై గ్రీవెన్స్

ప్రజాశక్తి- అడ్డతీగల : మండల కేంద్రంలో 22 పంచాయతీలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలు, సివిల్ సప్లై సమస్యలపై ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుండి ఒంటిగంట వరకు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గుండాల ఇసుక క్వారీని తక్షణమే మూసేయాలి

గిరిజన సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి ఎటపాక :ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా నడుస్తున్న గుండాల ఇసుక క్వారీని తక్షణమే మూసివేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం ఎటపాకలో గిరిజన సంఘాలు నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసా గ్రామసభల అనుమతి లేకుండా, ప్రజాభిప్రాయం సేకరించకుండా ప్రైవేట్ కంపెనీలకు అడ్డగోలుగా ఇసుక క్వారీని కట్టబెట్టారని విమర్శించారు. ఏజెన్సీలో గిరిజన సొసైటీల ద్వారా మాత్రమే ఇసుక క్వారీలు నిర్వహించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ప్రైవేట్ కంపెనీకి ఇసుక క్వారీ ఎలా నిర్వహిస్తుందని ప్రశ్నించారు. తక్షణమే ఇసుక క్వారీ నిర్వహిస్తున్న కంపెనీ అనుమతులు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ క్వారీని అడ్డుకోవడానికి గిరిజన సంఘాలు ఐక్యమై పోరాడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కాక అర్జున్ దొర, జాతీయ ఆదివాసీ అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు గొంది వెంకటేశ్వర్లు, ఇరపా అజయ్, నాగేశ్వరావు, నక్కా సూరిబాబు, బుద్దుల భద్రయ్య, సవలం రాము పాల్గొన్నారు



మాట్లాడుతున్న గిరిజన సంఘం నేతలు

సాంకేతిక విద్యలో నైపుణ్యాల కొరతను అధిగమించాలి

గీతం 'స్తుతి' కార్యక్రమంలో నిపుణుల సూచన



శిక్షణను ప్రారంభిస్తున్న డాక్టర్ రాంజీ

ప్రజాశక్తి- మధురవాడ : పారిశ్రామిక రంగంలో ఆటోమేషన్ పెరుగుతున్నప్పటికీ, 21 లక్షలకు పైగా ఉద్యోగాలు ఉన్నాయని, అయితే యువతరం తగిన నైపుణ్యాలను సాధించినప్పుడే అవకాశాలు చేజిక్కించుకోగలరని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రారంభమైన స్తుతి కార్యక్రమంలో నిపుణులు సూచించారు.ఇంజనీరింగ్, సైన్స్ పరిశోధనలను ప్రోత్సహించడానికి, అధ్యాపకులలో, విద్యార్థులలో అవగాహన పెంచడానికి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) ఆంధ్రప్రదేశ్‌లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహిస్తున్న 'స్తుతి' కార్యక్రమంలో భాగంగా 'అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ మెథడ్స్ ఫర్ ఆటోమొబైల్ అప్లికేషన్స్' శిక్షణను ఎయు సెంటర్ ఫర్ నానో టెక్నాలజీ డైరక్టర్ డాక్టర్ రాంజీ ముఖ్య అతిధిగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతర అధ్యయనం ద్వారా నైపుణ్యాలను పెంచుకోవాలని, అందుకు 'స్తుతి' వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. నూతన అంశాలపై అవగాహన పెరగడానికి స్వదేశీ, విదేశీ విశ్వవిద్యాలయాల నిపుణులతో నెట్‌వర్కింగ్ అవసరమన్నారు. ఇండస్ట్రీ 4.0లో భాగంగా విద్యార్థులు 3డి ప్రింటింగ్, కృత్రిమ మేధ, మిషన్‌లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాలపై నైపుణ్యాలను సాధించాలని సూచించారు.

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సి.విజయశేఖర్ మాట్లాడుతూ పరిశోధనలకు ఉపయోగించే శాస్త్ర పరికరాల వెనక సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవాలన్నారు. గీతం మెకానికల్ ఇంజనీరింగ్ అధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ డిఆర్‌డిఒ సహ హెచ్‌పిసిఎల్ వంటి పరిశ్రమలతో కలిసి తాము పనిచేశామని, పదార్థ విజ్ఞానంపై పరిశోధనలకు అధునాతన ప్రయోగశాలలను అభివృద్ధి చేశామన్నారు. గీతం 'స్తుతి' ప్రాజెక్టులో వివిధ కళాశాలల అధ్యాపకులకు, పరిశోధకులకు తమ ప్రయోగశాలలలో వివిధ ప్రాజెక్టులపై అవగాహన కలిగిస్తామన్నారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ బళ్ళశ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ గీతం స్తుతి ప్రాజెక్టులో భాగంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలోని వివిధ కళాశాలలలో ఇప్పటి వరకు ఏడు శిక్షణా కార్యక్రమాలను ఏడాది పొడవునా నిర్వహించామని, తద్వారా దాదాపు 350 మంది అధ్యాపకులు ప్రయోజనం పొందారని తెలిపారు. భవిష్యత్తులో వివిధ కళాశాలలు చేపట్టే పరిశోధనా ప్రాజెక్టులను గీతంలో సమీక్షించి డిఎస్‌టి అనుమతికి పంపడం జరుగుతుందని వెల్లడించారు. అధ్యాపకులలో పరిశోధనా కాంక్షను పెంచడం స్తుతి ప్రాజెక్టు అంతిమ లక్ష్యం అని ఆయన తెలిపారు. శిక్షణ కార్యక్రమ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.శివప్రసాద్, డాక్టర్ వి.ఎస్.ఎన్. వెంకటరమణ, కార్యదర్శి డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ సి.హెచ్.శోభ పాల్గొని ప్రసంగించారు. ఈ నెల వరకు జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొనడానికి దేశం నలుమూలల నుంచి అధ్యాపకులు హజరయ్యారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో సత్య సాయిబాబా 97వ జయంతి వేడుకలు ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సత్యసాయి బాబా సన్నిధిలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

పెందుర్తి :97వ వార్డు చిన ముసిడివాడ సత్యసాయి జన్మదిన వేడుకలు సందర్భంగా పేదలు, వృద్ధులకు కార్పొరేటర్ వసంత చేతుల మీదగా దుప్పట్లు, పండ్లను పంపిణీ చేశారు అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు సతీష్, సీతయ్య నాయుడు, సరస్వతీ నరసింహమూర్తి, గౌరి నాయుడు, కుమార్ సన్యాసిరావు చలపతి పాల్గొన్నారు

గాజువాక : 87 వార్డులో సత్యసాయి జన్మదిన సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు, పండ్లను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అందజేశారు. వైసిపి నేతలు బొడ్డ గోవింద్, కోమటి శ్రీనివాసరావు, ప్రగడ వేణుబాబు అడారి శ్రీను, శ్రీరాములు, జేరిపోతుల ఈశ్వరరావు పాల్గొన్నారు

74వ వార్డు పరిధి వెంపళ్ళ నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో సత్యసాయి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పాల్గొని, సత్యసాయి సేవా సమితి సమకూర్చిన 200మందికి అమృత కలశాలను పేదలకు అందించారు. గళ్ళా శంకర్ సాయిరాం, పిఆర్‌ఎస్ నాయుడు, న్యూపోర్ట్ ఎస్‌ఐ శ్రీనివాసరావు, బి బాబురావు, ఎస్ బాబురావు, ఎం కొండబాబు, ఎన్ శ్రీనివాస్, ఎం వెంకటేశ్వరి, గల్లా విజయకుమారి పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న ప్రభాకర్

గ ం గ వ ం మండలంలో నెల్లిపుడి గ్రామంలో రైతులనుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేసే విధంగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు గంగవరం కోఆప్షన్ సభ్యులు కళ్లెం ప్రభాకర్ బుధవారం వినతిపత్రం అందజేశారు. మండలంలో పలు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించిన సందర్భంగా ఈ వినతిపత్రం సమర్పించారు. నెలిపూడి పరిసరాలలో ముకాస భూములు కావడం వల్ల పంట నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం కాని, బీమాగానీ వర్తించటం లేదని తెలిపారు. కనీసం సన్న, చిన్నకారు రైతులకు రైతు భరోసా కూడా రావడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు అయినా చేస్తే దళారీలు భారీ నుండి రైతులకు ఆదుకోవచ్చని విజ్ఞప్తి చేశారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

నేరాలు ఘోరాలు

నదిలో మునిగి బ్యాంకు ఉద్యోగి మృతి



శబరి నదిలో రామారావు మృతదేహం

ప్రజాశక్తి-చింతూరు : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంట గ్రామంలోని ఎస్‌బిఐలో క్యాషియర్‌గా పనిచేస్తున్న తిరుపతిరావు (30) సోమవారం శబరి నదిలో స్నానం చేయుటకు వెళ్ళి గల్లంతయ్యాడు. కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో ఆ రోజు ఉదయం 8 గంటలకు స్థానానికి శబరి నదిలోకి దిగిన ఆయన అదుపుతప్పి శబరి నదిలో గల్లంతయ్యారు. విఆర్ పురం నుంచి గజ ఈతగాళ్లను రప్పించి మూడు రోజుల నుంచి గాలింపు చెయ్యగా బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆచూకీ లభించింది. శబరి నీటి ప్రవాహంలో కొట్టుకొని చింతూరు బ్రిడ్జ్ దగ్గరలో ఆయన మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని చింతూరు నుంచి కుంటకు పడవలో తీసుకొచ్చారు. మృతుడు తిరుపతిరావుకు మూడు నెలల క్రితమే వివాహం జరిగింది. స్వస్థలం శ్రీకాకుళం జిల్లాగా తెలిసింది. కుంట పోలీసులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి



వెంకటలక్ష్మి

మండలంలోని అమీరాబాద్ కాలనీకి చెందిన వెంకటలక్ష్మి అనే వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు జడ్డంగి ఎస్ఐ షరీఫ్ బుధవారం తెలిపారు. జడ్డంగి గ్రామానికి చెందిన పళ్ళపాటి నాగమణి కుమార్తె వెంకటలక్ష్మికి అమీనాబాద్ గ్రామానికి చెందిన అన్న కొడుకు అయిన పలివెల దావీదుతో మూడు ఏళ్ళ క్రితం వివాహమైంది. అప్పటినుండి వెంకటలక్ష్మి అమీనాబాద్ కాలనీలో అత్తవారింటి వద్ద ఉంటుంది. ఈనెల 21న తన భర్త అత్తమామలు ఉదయం పొలానికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి వెంకటలక్ష్మి కనబడలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో జడ్డంగి గ్రామంలోని ఆమె తల్లి నాగమణికి సమాచారం అందించారు. అయితే బుధవారం నాటికి కూడా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో వెంకటలక్ష్మి భర్త దావీదు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసినవారు జడ్డంగి పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.